# మబ్బు విడిచింది

స్వాతీకుసుమకుమారి

విజయవాడ ప్లాట్‌ఫారం హడావిడిగా ఉంది. విభిన్న సంస్కృతుల మనుష్యులతో అంతటా కోలాహలం, ఆరాటం, ఉరుకులూ పరుగులూనూ.

ఈస్ట్‌కోస్ట్ రెండున్నర గంటలు లేటంటే ముందు హడలిపోయారు కాని ప్లాట్‌ఫారం మీద జనాన్ని చూస్తుంటే టైము తెలియకుండానే గడిచిపోతుంది.



కొంతమంది క్లోజ్‌డ్ సర్క్యూట్ టీవీల ముందు కాలక్షేపం చేస్తుంటే, మరికొంతమంది సిమెంట్ బెంచీల మీద కూర్చొని వచ్చే పోయేవాళ్ళ మేనరిజమ్స్ చూస్తూ వాళ్ళ సైకాలజీ ఎన్‌లైజ్ చేసుకొంటున్నారు. ఇంకా కొంతమందయితే తీరిగ్గా ప్లాట్‌ఫారం ఆ కొస నుంచి ఈ కొసవరకూ పచార్లు చేస్తున్నారు.

సుమిత్రకు ఏదో విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన

ట్లు అనిపిస్తుంది. రెక్కలొచ్చి ఎగురుతున్న అనుభూతి కలుగుతుంది.

జీవితం ఎంతో అందంగా, ఆనందంగా కనిపిస్తుంటే, పిల్లల ఆటల్ని మురిపెంగా చూస్తూ కూర్చున్న భర్తకు ఇంకొంచెం దగ్గరగా జరిగి "ఇంత తొందరగా మనకు ట్రాన్స్‌ఫర్ రావడం ఓ కలలా అనిస్తుందండీ!" అంది ఉప్పొంగుతున్న సంతోషంతో.

రామకృష్ణ నవ్వాడు. "దానికోసం ఎంత ఖర్చు పెట్టానో, శ్రమ పడ్డానో తెలుసుగా?"

"అయితేనేం! అనుకొన్నది సాధించేం. ఇక పిల్లలు కొత్త వాతావరణానికి అలవాటు పడితే చాలు. అన్ని విధాల మనం అక్కడే సెటిలయిపోవచ్చును.

"వాళ్ళదేముంది సుమిత్రా! నాలుగు రోజులు కొత్తగా అనిపిస్తుంది కాని తర్వాత వాళ్ళే అలవాటు పడతారు. కాన్వెంటులో సీట్లు కూడా దొరికాయి. ఇక చదువు గురించి ప్రోబ్లం లేదు. ఫ్యూను మంచి ఇల్లు చూసిపెట్టాడు. నీకు బాగా నచ్చటమే కాదు చుట్టుపక్కన వాళ్ళతో మంచి కంపెనీ కూడా ఉంటుంది."

ఆడుకొంటున్న హనీ, నానీలను చూస్తూ "మనదేముంది కాని పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచనంతా. ఇకనుండి వాళ్ళ చదువుల కోసం, వాళ్ళ ఉన్నతికోసం మనం జాగ్రత్త పడాలండీ" అంది.

"అందుకే కదా ఈ ట్రాన్స్‌ఫర్! ఇక మన ఆలోచనలన్నీ పిల్లల గురించే. ఇప్పుడు నిశ్చింతగా జీవితంలో కొంత వాళ్ళ పేర డిపాజిట్ చేస్తాను" అంటూ వాళ్ళ అందమైన భవిష్యత్తు గురించి ముచ్చట్లాడుకొంటూ ఉండగానే హనీ, నానీ పరుగున వచ్చారు.

ఎంతకీ ట్రెయిన్ రాకపోవడం విసుగ్గా ఉంది వాళ్ళకు.

"అబ్బా! ఎంతసేపు డాడీ ఇక్కడ ఉండటం?" నానీ చిరాగ్గా అన్నాడు.

సుమిత్ర వాడిని ఒళ్ళోకి తీసుకొని "ఇంకెంతసేపు? ఓ అరగంటే! తర్వాత ట్రెయిన్ ఎక్కి ఎంచగ్గా మనం కొత్త ఊరు, కొత్త ఇంటికి వెళ్ళిపోతాం! ఎంత బావుంటుందో అక్కడ!" మురిపిస్తున్నట్లు అంది.

హనీ తండ్రి ఒళ్ళో వాలి "ఇక్కడేం బాగాలేదు డాడీ! ఇంటికెళ్ళిపోదాం. తాతయ్య నిన్న కొత్త కథ చెబుతానన్నాడు" అంది.

"మీ మమ్మీ బోలెడన్ని కథలు చెబుతుంది రోజా!"

"నాకు కథలేం వద్దు. బాబాయి కావాలి. బాబాయి చాకెట్లిస్తాడు. పార్కుకి తీసుకెళతాడు. వెళ్ళిపోదాం మమ్మీ" కాళ్ళూ, చేతులూ కొట్టుకొంటూ మారాం చేస్తూ అన్నాడు.

"డాడీ కావలసినన్ని చాక్లెట్లు కొనిస్తారు. అవునూ, నీకు పెద్ద గన్ కొనిస్తానని డాడీ మొన్న చెప్పారు కదూ! అడగవేం?" మరిపిస్తూ అంది.

నానీ కళ్ళు మెరిశాయి. ఒక్కసారి తండ్రి ఒళ్ళోకి దూకి "అవును డాడీ! మొన్న గన్ కొంటానన్నారు మీరు. కొనండి" అన్నాడు.

"ఓ.కె. అలాగే ముందు మనం ఊరెళ్ళగానే నానీకి గన్, హనీ కి పెద్ద బేబీ బొమ్మ కొనాలి. మాటిచ్చాక తప్పదు కదా? సుమిత్రా! ట్రెయిన్ దిగగానే నువ్వు ఈ విషయం నాకు గుర్తు చెయ్యాలి".

"గుర్తు చెయ్యడం కాదు. మీరు కొనక పోతే ముందు నేను ఊరు కోను తెలుసా" నవ్వుతూ హెచ్చరించింది.

ఆ మాటతో నానీ హనీలకు ఒక్కసారిగా సంతోషం




ఉత్సాహం కలగడంతో చెంగున దూకి ప్లాట్‌ఫారమ్ మీద పరుగులు పెడుతూ మళ్ళీ ఆటల్లో పడ్డారు.

వాళ్ళను చూస్తూ ఇద్దరూ మురిపెంగా నవ్వుకొన్నారు.

"పిల్లలదేముంది? మరిపిస్తే ఏదైనా క్షణాల్లో మరచిపోతారు. ఇక్కడ మనుష్యుల్ని వాతావరణాన్ని నాలుగు రోజుల్లో మరచిపోరూ?"

"ఎటొచ్చీ మీకే బెంగ అంటారా?" ఓరగా చూస్తూ అంది.

"అబ్బే అదేం లేదు. ఇప్పుడు నేను ఇద్దరి బిడ్డల తండ్రిని- పైగా వాళ్ళ భవిష్యత్తును తీర్చిదిద్ద వలసిన బాధ్యత గల తండ్రిని" అన్నాడు స్థిరంగా.

దూరంగా కనిపిస్తున్న కొండనీ, కొండ మీద ఇళ్లనీ చూస్తూ సుమిత్ర నిదానంగా అంది. "నాకు మాత్రం మనం కూడా ఆనందంగా బతకాలనీ, మనం మన సుఖం గురించి కూడా ఆలోచించుకోవాలని ఉంది. ఎందుకంటే ఎల్లకాలం ఇలాగే ఉండం కదా! వయసూ, వయసుతోపాటు బాధ్యతలూ పెరిగినపుడు ఎలాగూ మన గురించి మనం ఆలోచించుకోలేం".

చిరునవ్వుతో ఆమె వైపు చూస్తూ "నిజం సుమిత్రా అందంగా జీవించడం, ఆనందంగా బతకడం ఎలా అన్నది నీ నుండే నేను నేర్చుకొన్నాను. అందుకేగా ఈ ప్రయాణం" అన్నాడు ఎంతో తృప్తిగా.

సుమిత్రకు జీవితం సప్తవర్ణాల హరివిల్లులా అనిపిస్తుంది.

భవిష్యత్తు గురించి రంగుల కలలు కంటూ ఉండగానే ఎక్కడి నుంచో గాలి దుమారంలా పది పన్నెండు మంది పిల్లలు పరుగున ప్లాట్‌ఫారం మ్మీద కొచ్చారు.

దుమ్ముకొట్టుకుపోయిన ఒంటి మీద చిరిగిపేలికలైన చొక్కానో, నిక్కరో తప్ప రెండూ ఏ ఒక్కళ్లకూ లేవు. చింపిరి జుట్టు మురికి ఒళ్ళుతో వికారంగా ఉన్న వాళ్ళను చూసి హనీ, నానీ రివ్వున వెనక్కి వచ్చి వింతగా చూస్తుండిపోయారు.

అంత పది పన్నెండేళ్ళ లోపు పిల్లలే కాని ఒకరిద్దరి చేతుల్లో సిగరెట్టు పీకలు కూడా ఉన్నాయి. వాళ్ళ నోటి నుండి బూతుపదాలు సునాయాసంగా దొర్లిపోతున్నాయి.

రామకృష్ణ చిరాకు పడ్డాడు. "ఏం పిల్లలో చూడు! వేలెడంత లేరు. ఎన్ని అలవాట్లో?"

సుమిత్రకు కూడా వాళ్ళను చూస్తుంటే కంపరంగా అనిపించింది. "వీళ్ళనని ఏం లాభం? కని పారేసిన తల్లిదండ్రులననాలి. వీళ్ళు రేపు ఎటువంటి వ్యక్తులుగా తయారవుతారో తలుచుకొంటేనే భయం వేస్తుంది"

గోలగా అరుస్తూ రివ్వున పరుగులు తీస్తున్న వాళ్ళను కానిస్టేబుల్ లాఠీతో అదిరించినా బెదిరిపోకుండా లాఠీ దెబ్బకు అందకుండా కేరింతలు కొడుతూ అటునిటూ పరుగెడుతున్నారు.

ఇంతలో ఏదో ట్రెయిన్ రావడంతో జనంలో కలిసిపోయారు.

ఏవగింపుతో వాళ్ళనీ, వాళ్ళని కన్న వాళ్ళనీ విమర్శించుకొంటూ ఉండిపోయారు సుమిత్రా. రామకృష్ణ.

హనీనానీ మధ్య మధ్య మారాం చేస్తున్నారు తాతయ్య, కావాలి, నానమ్మ కావాలి' అంటూ.

"శెలవు లిచ్చాక మళ్ళీ వస్తాం ఇప్పుడు కాదమ్మా!" అంటూ సముదాయిస్తున్నారు.

"ఇక్కడైతే రోజా బాబాయి బడికి తీసుకెళతాడు. తాతయ్య ఇంటికి తీసుకొస్తాడు. ఇక్కడే ఉంటాం డాడీ! మేం అక్కడకురాం".

"తప్పమ్మా హనీ మనం వెళ్ళే ఊరులో కాన్వెంటులో చాలా బాగుంటుంది. బాగా చదువు చెబుతారు. ఇల్లు కూడా పెద్దది".

"అయితే తాతయ్యనూ అందరినీ తీసుకెళదాం" వాళ్ళ ప్రశ్నలకి ఓపిగ్గా సమాధానం ఇస్తున్నారు ఇద్దరూ.

"వాళ్ళు అంత దూరం రాలేరమ్మా! అయినా తాతయ్యకు ఇక్కడ ఇల్లు ఉంది కదా! ఇల్లొదిలేసి ఎలా వస్తారు?

"మనం రావడంలే!" హనీ అడిగింది.

"డాడీ కంటె ట్రాన్స్‌ఫరయింది కాబట్టి వస్తున్నాం".

"మరి తాతయ్యకు టాన్స్‌వర్ ఎప్పుడొస్తుంది?"

నవ్వొచ్చింది. "తాతయ్యకు ఉద్యోగం లేదుగా! ట్రాన్స్‌ఫర్ రాదు. అందుకని ఎప్పుడూ అక్కడే ఉండిపోవాలి." చెప్పింది మిత్ర.

హనీ ఆలోచనలో పడింది - "అయితే తాతయ్యకు డబ్బులెట్లా వస్తాయి డాడీ!"

"ష్" అంటూ ఓసారి ఊపిరి పీల్చుకొని చెప్పాడు రామకృష్ణ "తాతయ్యకు పొలం ఉంది కదా? పంటొచ్చినప్పుడల్లా అమ్మితే డబ్బులొస్తాయి. సరే, ట్రెయిన్ వెళ్ళిపోతుంది చూడు." ధోరణి మళ్ళించాలనుకొంటూ మాట మార్చాడు.

ట్రెయిన్ వెళ్ళిపోవడంతో ప్లాట్‌ఫారం మీద జనం మళ్ళీ పలచబడ్డారు.

అంతకుముందు ఆటలాడిన పిల్లలంతా పట్టాల పక్కన పడి ఉన్న చిత్తుకాగితాలు, కవర్లు, పేపరు కప్పుల్లాంటివి ఏరి ఓ గోతంలో వేసుకొని ప్లాట్‌ఫారమ్ ఎక్కారు. ఆ గోతాల్ని ఇనుప ఫెన్సింగు కవతలపెట్టుకొని కేరింతలు కొడుతూ మళ్ళీ ఆటల్లో పడ్డారు.

వాళ్ళందరిలో చిన్నగా కనిపిస్తున్న ఏడెనిమిదేళ్ళ పిల్లాడు చేతిలో ఓ పెద్ద పొట్లాంతో ఉత్సాహంగా వచ్చి అక్కడున్న సిమెంటు చప్టామీద కూర్చొని గబగబా పొట్లాం విప్పాడు.

దాన్నిండా పులిహోర!

వాడి మొహం ఆనందంతో వెలిగిపోయింది. వాడింకా చెయ్యయినా పెట్టకుముందే బిలబిల్లాడుతూ మిగిలిన పిల్లలు చుట్టుముట్టారు.

